క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం రేపు

అడ్డతీగల: అడ్డతీగల మండలం డి.భీమవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వైద్య నిపుణులు హాజరై అక్కడికి వచ్చే ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాపన్నదొర కోరారు.

రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ సురేంద్ర

అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం పంచాయతీ దుమగుడ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిల్లో సురేంద్ర బుధవారం 40 మంది నిరుపేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న చల్లి తీవ్రతతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ కారణంగా తమ వంతు సాయంగా రగ్గులు అందజేస్తున్నామన్నారు. దాతలు ఎవరైన ఉంటే గిరిజన ప్రాంతంలో ఎంతో మంది నిరుపేదలున్నారని తోచిన సాయం అందించి సేవా దృక్పదం చాటుకోవాలని కోరారు. వైస్ సర్పంచ్ భగత్ రాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలిరండి

రంపచోడవరం: విజయవాడలో ఈనెల 19న ప్రభుత్వం చేపట్టనున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి దూదేకుల ముస్లిం సోదరులందరూ తరలిరావాలని రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ లాలీ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అని కొనియాడారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కబడ్డీ క్రీడలో బాలికలు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంతో పాటు డీసీఎంఎస్ ఆవరణలో బుధవారం ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. డీసీఎంఎస్ ఆవరణలో బాలికలు కబడ్డీ పోటీలు నిర్వహించగా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. క్రీడల్లో తమ సత్తా చాటుకునేందుకు వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు చురుగ్గా పాల్గొన్నారు. నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

భజన బృందానికి ఘనంగా సత్కారం

తుమ్మపాల : ధనుర్మాస విశిష్టతను పెంపొందిస్తూ చినరామ భజన బృందం నెలరోజుల పాటు స్వామివారి మేలుకొలుపుతో భక్తి కీర్తన భజనలు చేస్తూ ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించారని చినబోయగూడం వీధి శ్రీ కోదండరామ దేవాలయ కమిటీ చైర్మన్ కర్రి రమేష్ అన్నారు. ధనుర్మాస ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీ కోదండరామ దేవాలయంలో చినరామ భజన బృందాన్ని బుధవారం ఘనంగా సత్కరించారు. ధనుర్మాసంలో ప్రతి నిత్యం వేకువజామున లేచి భక్తిభావంతో గోదాదేవి ఊరేగింపుగా పట్టణంలో ప్రతి దేవాలయాన్ని సందర్శించి ప్రతి ఒక్కరిలోను ఆధ్యాత్మికతను పెంపొందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు బృందం సభ్యులు ఆళ్ల శ్రీను, బొడ్డేడ రాజు, కర్రి రాము తెలిపారు. ప్రతిరోజు 30 మందికి పైగా స్వామివారి భక్తి కీర్తనలతో భజనలు ఘనంగా నిర్వహించారన్నారు. శ్రీ రంగనాథ గోదాదేవిల ఆశీస్సులు అందరికీ లభించి ముక్తి పొందాలన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు పిల్లా రామ అప్పారావు, మల్ల వెంకటేష్, విల్లూరి సురేష్, పిల్లా రామకృష్ణ, బుద్ద బుజ్జి, విల్లూరి పరమేశ్, కాండ్రేగుల నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

మార్గం.. సుగమం



- దిబ్బపాలెం- పెదకొటకు పూర్తయిన రహదారి
- రూ.1.50కోట్లతో మరమ్మతు పనులు
- 70 గ్రామాలకు అందుబాటులోకి వచ్చిన రోడ్డు
- ఆనందంలో గిరిజనులు



గతంలో గోతులమయంగా పినకోట- పెదకోట రహదారి



అస్తవ్యస్తంగా మారిన రోడ్డు (ఫైల్)

గిరిజన గ్రామాల్లో **అధ్వాన రోడ్లతో అవస్థలు తప్పేవి కావు. టీడీపీ** ప్రభుత్వ హయాంలో గోతుల రహదారులతో రాకపోకలకు ఇబ్బందులుండేవి. అత్యవసర సమయాల్లో 108, అంబులెన్స్ తదితర సేవలు అందక గిరిజనులు నానా అవస్థలు పడ్డారు. వర్షాలు కురిస్తే గోతుల్లో నీరు చేరిన వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడేవారు. రహదారులు బాగు చేయాలని గ్రామస్తులు అప్పటి టీడీపీ పాలకులకు వినతులిచ్చినా స్పందించే నాథుడు కరువయ్యాడు. ఏళ్లతరబడి రోడ్డు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్యంలో రహదారులకు మోక్షం కలిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించారు. శివారు గ్రామాల్లో సైతం రహదారులు ఇతరత్రా మౌలిక సదుపాయాలను కల్పించారు. చాలా గ్రామాల్లో రహదారి నిర్మించడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు, ఇతరత్రా ప్రైవేట్ వాహనాల రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు పరిష్కారమవడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

అనంతగిరి: మండలంలోని చాలా గ్రామాల్లో కొన్నేళ్లుగా పట్టి పీడిస్తున్న రహదారి సమస్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పరిష్కారమైంది. ఏళ్ల తరబడి అధ్వాన దారులతో మండల వాసులు ఇబ్బందులు పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలోని చాలా గ్రామాలకు రహదారులు, వంతెనలు అందుబాటులో వచ్చాయి. ఇందులో భాగంగా మండలంలోని మారుమూల పినకోట, పెదకోట రహదారి మరమ్మతు పనులతో మార్గం సుగమమైంది. పదేళ్ల క్రితం దేవరాపల్లి నుంచి జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలను కలుపుకుంటూ జాలడ గ్రామం వరకు విడతలవారీగా రహదారి నిర్మాణం చేపట్టారు. అనంతరం రహదారి అధ్వానంగా మారడంతో నాలుగు పంచాయతీలకు చెందిన సుమారు 70 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పెద్ద పెద్ద గోతులతో రాకపోకలకు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు ఏళ్ల తరబడిన రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో నలుగు పంచాయతీల గిరిజనులు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అయితే నిర్వహణ లేకపోవడంతో



దిబ్బపాలెం-పెదకోట రహదారి నిర్మాణ పనులు

రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఈ రహదారి ఆర్ అండ్‌బీశాఖ పరిధిలోకి రావడంతో మోక్షం కలిగింది.

దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట వరకు మరమ్మతులు

దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట పంచాయతీలకు వెళ్లేందుకు రహదారి పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. అడుక్కో గొయ్యి ఏర్పడి, రహదారి ప్రమాదభరితంగా మారింది. దీంతో గిరిజనులు ప్రమాదాలకు గురయ్యేవారు. మొదటి విడతగా ఆర్‌అండ్‌బీశాఖ దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట వరకు 5.8 కిలో మీటర్లకు గాను, రూ.1.50 కోట్లతో గత నెలలోని మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో పినకోట, పెదకోట వరకు మార్గం సుగమమైంది. పెదకోట నుంచి కివర్ల పంచాయతీ జాలడ వరకు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. దిబ్బపాలెం నుంచి జీనబాడు వరకు సుమారు రూ.10 లక్షలతో మరమ్మతు పనులకు సంబంధించి ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉంది.

ఇబ్బందులు తప్పాయి



రహదారి అస్తవ్యస్తంగా మారడంతో గతంలోని తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోని ఆర్‌అండ్‌శాఖ నేతృత్వంలోని దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోటవరకు మరమ్మతులు చేపట్టడం ప్రయాణాలకు ఇబ్బందులు తప్పాయి.

– **ఉర్మా శకుంతల**, వైస్ ఎంపీపీ అనంతగిరి

మరమ్మతు పనులు చేపట్టాం

దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోటవరకు నాణ్యతప్రమాణాలతో మరమ్మతు పనులు చేపట్టాం. దిబ్బపాలెం నుంచి జీనబాడు వరకు మరమ్మతులకు టెండర్ ప్రక్రియలో ఉంది. టెండర్ పూర్తికాగానే పనులు చేపట్టే విధంగా చర్యలు చేపడతాం. గడువులోగా పనులు పూర్తి చేస్తాం.

– **నగేంద్ర**, ఏఈ అరకు ఇన్‌చార్జి ఆర్‌అండ్‌బీశాఖ

ఘనంగా పండగ వేడుకలు

- అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు
- సందడిగా గ్రామాలు
- భక్తిశ్రద్ధలతో గోపూజలు
- ముగ్గుల, ఆటల పోటీలు, విజేతలకు బహుమతులు



చినలబుడులో థింసా నృత్యం చేస్తున్న యువతీ, యువకులు

పెదబయలు: మండలంలో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండగలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో సందడి నెలకొంది. ముక్కనుమ వేడుకను పురస్కరించుకొని బుధవారం ఉదయం నుంచి పశువులకు పులగం తినిపించే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ ఏడాది పండించిన కొత్త పంటలతో తయారు చేసిన పులగంను ప్రత్యేకంగా కొత్త మట్టి కుండలో వండి పశువులు, దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆ ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామాల్లో బుడియాల సందడి చేశారు. గ్రామాల్లో యువతి యువకులు మహిళలు వివిధ వేషధారణలు చేసి ఇంటింటా తిరిగి బుడియాను సేకరించారు. పండగ సందర్భంగా యువత చేసిన థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సంప్రదాయాలను కాపాడుకోవాలి: రిటైర్డ్ ఏడీఎంహెచ్‌వో డాక్టర్ వీరబ్బాయి

గంగవరం : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విశ్రాంత అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ కోసు వీరబ్బాయి దొర అన్నారు. పెదగార్ల పాడు గ్రామంలో మూడు రోజులు పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. పెదగార్లపాడులో జరిగిన ముగింపు కార్యక్రమంలో డాక్టర్ కోసు వీరబ్బాయి దొర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదగార్లపాడు గ్రామంలోని యువత, ప్రజలు, ఉపాధ్యాయ ఉద్యోగులు, గ్రామ పెద్దలు అందరూ ఐక్యంగా ఉండి మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పండగ వేళ అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ చక్కటి ఆటలు, ముగ్గుల పోటీలు, పెట్టడం అభినందనీయమన్నారు. నేటి యువత చదువులో శ్రద్ధ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుపేద కుటుంబానికి చెందిన తాను కష్టపడి చదివి జిల్లా వైద్యాధికారి స్థాయికి ఎదిగానని, చదువుకు పేదరికం అడ్డంకి కాదని స్పష్టం చేశారు. లక్ష్యంతో చదివితే విజయం సొంతమవుతుందన్నారు. దొరమామిడి గ్రామ ఉప సర్పంచ్ కోసు రామన్న దొర, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.స్వామి దొర, ఉపాధ్యాయులు కోసు వీరప్ప దొర ,విద్యుత్ శాఖ ఉద్యోగులు కోసు తమ్మిన్న దొర, పోతురాజుదొర తదితరులు ప్రసంగించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమం నిర్వాహకులు రమాదేవి, మడకం సింగరమ్మ , మాజీ సర్పంచ్ కారం లక్ష్మి, బాపనమ్మ, మంగమ్మ, యూటీఎఫ్ నాయకులు కృష్ణ., బుజ్జిదొర వందలాది మంది గ్రామస్తులు పాల్గొన్నారు.



పెదబయలులో పశువులకు పులగం తినిపిస్తున్న గిరిజన రైతులు



పెదబయలు గ్రామంలో సీతారాముల వేషధారణలో చిన్నారులు



పెదగార్లపాడులోని కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఏడీఎంహెచ్‌వో డాక్టర్ వీరబ్బాయి దొర

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు బొట్టు పెడుతున్న వెలుగు సిబ్బంది, చిత్రంలో ఏపీఎం ఆదినారాయణ

రాజవొమ్మంగి: అక్క చెల్లెమ్మలకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగవ విడతగా మండలానికి రూ. 2.7 కోట్లు మంజూరైనట్లు ఏపీఎం ఆదినారాయణ తెలిపారు. మహిళా ఆర్థిక సాధికారత కల్పిస్తు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 22న వైఎస్సార్ ఆసరా నిధి మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆయా మహిళా సంఘాల సభ్యుల బ్యాంకు ఖాతాలకు ఈ సొమ్ము జమ అవుతుందన్నారు. రాజవొమ్మంగి, అప్పలరాజుపేట గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వెలుగు సీసీలు, వీఓఏలతో ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి (రుణవిముక్తి) పొందిన అక్కచెల్లెమ్మలకు బొట్టు పెట్టి అభినందనలు తెలిపారు. నాలుగవ విడతలో ఎవరికి ఎంత సొమ్ము జమ కానున్నదో వివరించారు. గత మూడు దఫాలతో కలిపి మండలానికి సుమారు రూ. 12.7 కోట్ల సొమ్ము ప్రభుత్వం విడుదల చేసినట్లు ఏపీఎం ఆదినారాయణ తెలిపారు. తద్వారా మండలంలోని 759 పొదుపు సంఘాలకు చెందిన 7,149 మంది సభ్యులు లబ్ధి పొందుతున్నారన్నారు. సీసీ పూర్ణిమ, వీఓఏలు ఆదిలక్ష్మి, చినతల్లి, దేవి, వీణా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



ఆర్టీసీ డ్రైవర్ ప్రసాద్, కండక్టర్ శ్రీనివాస్‌లను సన్మానిస్తున్న గ్రామస్తులు

రంపచోడవరం: సంక్రాంతి పండుగ వేళ తమ గ్రామానికి ఆర్టీసీ సేవలు అందిస్తూ తమలో భాగమైన ఆర్టీసీ ఉద్యోగులను వై.రామవరం మండలం కోట గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కోట గ్రామస్తులు గోకవరం ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను అభినందిస్తూ గోకవరం ఆర్టీసీ డీఎం రామన్న, ఎస్టీఐ అప్పారావులను గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ రూట్‌లో సర్వీసు ద్వారా సేవలందిస్తున్న డ్రైవర్ ప్రసాద్(కోట ప్రసాద్), కండక్టర్ శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. గిరిజనుల ఆత్మీయ బంధువుగా పేరు తెచ్చుకున్న వారిని కోట గ్రామస్తులు డ్రైవర్ ప్రసాద్, కండక్టర్ శ్రీనివాస్‌ల కాళ్లు కడిగి, బొట్టు పెట్టి పుష్పగుచ్చాలు అందజేసి, ఫలసాయాలు, పండగకు తయారుచేసిన పిండి వంటలను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.లక్ష్మణరావు, గ్రామస్తులు మాణిక్యాలరావు, గొర్లె ఆనంద్, గ్రామ పెద్దలు మంగయ్య, గొర్లె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వర్ల ఉత్సవం



సారె ఊరేగింపులో మహిళలు

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో గౌరీపరమేశ్వర్ల ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ పుర వీధుల్లో సారె ఊరేగించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భజనలు, తప్పెటగుళ్ల, కోటాటం కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా అమ్మవారి సారె ఊరేగింపు

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు గురువారం నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న అమ్మవారి ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఉత్సవంలో నేలవేషాలు, పలు స్టేజీ కార్యక్రమాలు, మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు జాతరలో ఆకర్షణగా నిలవనున్నాయన్నారు.

ఘనంగా రాములోరి తీర్థం



చిన్నారుల సందడి

అనకాపల్లి : మార్టూరు గ్రామంలో రాములోరి తీర్థం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు సీతా సమేత శ్రీరామ చంద్రమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఆలయం ముందు తీర్థం జరిగింది. తీర్థంలో రంగులరాట్నం, చిన్నారుల ఆటవస్తువులు వెలిశాయి. రంగులరాట్నం ఎక్కేందుకు చిన్నాపెద్దా క్యూకట్టారు. జంపింగ్ స్ప్రింగ్‌తో చిన్నారులు ఆటలాడుకున్నారు.

కమనీయం... శ్రీవారి కల్యాణం



శ్రీనివాసుని కల్యాణ వేడుకలో భక్తులు

అనకాపల్లి : సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నుదురుపాటి తాతాజీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని స్థానిక నుదురుపాటి వరహాలు కల్యాణ మండపంలో బుధవారం శ్రీవారి కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణంలో అన్నమాచార్య కీర్తనలు భక్తులకు ఆకట్టుకున్నాయి. అంతకుముందు తాతాజీ 60 మంది నిరుపేదలకు నిత్యవసర సరుకులతోపాటు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏటలోకి అడుగుపెట్టినందుకు 60 మంది నిరుపేదలకు ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త మలసాల భరత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ శ్రేణులు రమణరావు, శ్రీనివాసరావు, మలసాల కిశోర్, సతీష్, రమేష్‌గుప్త, కామేష్, కృష్ణకుమార్, న్యాయవాది రమణయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాలుర కబడ్డీ పోటీలు నేడు

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో ముత్యమాంబ అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా స్థాయి బాలుర కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెంకటరమణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, విజేతలకు వరుసగా రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే టీమ్‌లు ప్రారంభ సమయానికి ముందుగా చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

సందడిగా తీర్థ మహోత్సవాలు



జాతరలో చిన్నారుల సందడి

ఎస్.రాయవరం : సంక్రాంతి వేడుకలు పురస్కరించుకుని గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సైతారుపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన తీర్థంతో సందడి వాతావరణం నెలకొంది. తీర్థం చూసేందుకు పరిసర గ్రామాలు సర్వసిద్ధి, పేటసూదిపురం, జేవీ పాలెం, వేమగిరి తదితర గ్రామాల వారు సైతారుపేట చేరుకుని సందడి చేశారు. తీర్థంలో ఆట వస్తువుల వద్ద చిన్నారు లు కేరింతలు కొట్టారు. యువత రంగుల రాట్నాలు ఎక్కి ఉత్సాహం ప్రదర్శించారు. ఉత్సవ కమిటీ సభ్యులు రామాలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పైడితల్లమ్మ తీర్థం నేడు

రాంబిల్లి : మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

మార్టూరులో గుర్రాల పరుగు పోటీలు



గుర్రపు పరుగు పోటీలను ప్రారంభిస్తున్న భరత్‌కుమార్

తుమ్మపాల : మార్టూరు గ్రామంలో శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా కనుమ మరుసటి రోజున నిర్వహించే సీతారాముల ఉత్సవాన్ని యధావిధిగా ఈ ఏడాది వైభవంగా గ్రామ ప్రజలందరూ కలిసి నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ రామాలయంలో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం గ్రామంలో ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, వైఎస్సార్‌సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కరణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.